# పాతచీర

లలిత నిరీక్షిస్తోంది. నిముషాలు, గంటలు. ఆ నిరీక్షణలో కాలం కరిగిపోతుంటే చిరాకు పుట్టుకొస్తోంది. "ఛీ! ఇంక ఎదురు చూసి లాభంలేదు." అనుకుంది. "ప్రొద్దున్నే ఈ వేళ ఇలా ప్రారంభమైంది. రోజంతా ఎలా ఉంటుందో! అంతాఖర్మ." పెరటివైపు నడిచింది.

లలిత ఎదురుచూసింది ఏ అపూర్వమైన వ్యక్తి రాకకోసమోకాదు. మరీ అత్యంత ఆత్మీయునికోసం అంతకన్నా కాదు. తన ఇంట పనిచేసే కనకమ్మకోసం లలిత ఎదురు చూస్తోంది.

చిన్నప్పటినుంచి ఇంటిపనంటే కాస్త బద్ధకమే లలితకు. అక్కయ్యలు లలితను పనిదొంగ అంటుడేవారు."యింతబద్ధకమైతే ఎలాగే? పెద్దయ్యాక యిలా అయితే నువ్వేం సంసారం చేస్తావ్?" అనేది అమ్మ. "అదిగృహరాజ్యానికి రాణి అయితే మహారాజైన దాని మొగుడు పాపం అంట్లగిన్నెలు ముందేసుక్కూర్చుంటాడే అమ్మా" అంటూ ఎగతాళి చేసేవారు అక్కయ్యలు. కాని, రాత్రి తొమ్మిదింటికి తన సపర్యలన్నీ పూర్తిచేయగానే పాన్పు చేరిన శ్రీవారు, యిప్పటికింకా, ఆ పాన్పుని విడిచిరాలేదు.

అత్తగారు ఊళ్ళోవుంటే, హాయిగా తనూ అంతే. తన అదృష్టం ఏమోకాని, అత్తగారు తనని ఎక్కువగా ఏ పనీ చెయ్యనివ్వరు. వంటా, వార్పు ఆవిడే చేసుకునేవారు. పై పనులు, పాపాయి పనులూ చూసుకోవడానికి పనిమనిషి ఉంది. అందుకే తన బద్ధకానికి స్వస్తి చెప్పవలసి రాలేదు.

అక్కయ్యలు అన్నట్టుగా, తను ఈ గృహరాజ్యంలో రాణిలానే సంచరిస్తోంది. ఈరోజు మాత్రం ఇక తప్పదు. అత్తగారు ఊరెళ్ళక పోతే బాగుండేది. ఆలోచిస్తూనే అంట్లగిన్నెల ముందుకూర్చుంది. ఒక్కోటీ తోమటం ప్రారంభించింది.

అప్పుడు ప్రత్యక్షమైంది కనకమ్మ. విసుగూ, కోపమూ మేళవించి "ఏమే కనకం; ఇప్పుడా, రావడం?" అంది లలిత.

"ఆలస్యమై పోనాదండమ్మా, ఇయ్యాల. రేపట్నించి బేగా వచ్చేత్తాలెండి. ముందు మీరు సెయ్యి కడిగేసుకోండి."అంది కనకమ్మ వినయంగా. చేతులు కడుక్కుని లోపలికి వెళ్ళి పోబోతున్న లలిత చూపులు కనకమ్మ కట్టుకున్న చీరమీద నిల్చిపోయాయి. చిలకాకు పచ్చరంగుకు ఎరుపు అంచుతో చీర ఖచ్చితంగా ఆ చీర అత్తగారిదే. సందేహంలేదు. దీనికెలా వచ్చింది!

"ఎలా వస్తుంది నాతెలివి తక్కువ కాని! దొంగముండ, దొంగిలించి ఉంటుంది. అత్తగారు వూరెళ్ళి పదిరోజులైంది. ఈలోగా కానిచ్చి ఉంటుంది. కట్టుకొని మరీ వచ్చింది. దీనికెంత ధైర్యం? పోనీ అత్తగారు యిచ్చి వుంటారేమో అనుకోవడానికి కూడ అవకాశం లేదు. ఏదీ అంతసులువుగా పనివాళ్ళకిచ్చేసే రకం కాదు ఆవిడ. పోనీ యిచ్చారే అనుకున్నా - ఏచిన్నపనీ కూడ తనతో సంప్రదించనిదే అసలు చెయ్యరే." అలా నిశ్చయించుకున్నాక లలిత మరి కోపం పట్టలేక పోయింది.

'ఈ చీర నీకెలా వచ్చిందే? మేము బయట ఆరవేసుకున్నపుడు పట్టుకుపోయావు కదూ?' గర్జించింది.

కనకమ్మ ఆశ్చర్యపోయింది.

'అదేమిటమ్మగారూ! ఇన్నేళ్ళుగా మీకాడ పనిచేస్తుండాను. నేనెలాటి దాన్నో తెలియదా మీకు? అలాటి పాపం పనులు నే సేత్తానా? దొంగబుద్ధి మా ఇంటావంటానేదు. ఈ సీర --' కనకమ్మ ఏదో అనబోతుండగానే-

"చాలు చాల్లేవే, నువ్వూ నీ మాయ మాటలూ! నాకెందుకు తెలియదూ! బాగా తెలుసు! మీలాంటి వాళ్ళందరూ బాగా నమ్మించి తర్వాతే గదా మోసాలు చేయడం మొదలు పెడతారు. అత్తగారి అమాయకత్వాన్ని చూసి నువ్విలా చేసావు ఆవిడ వూళ్ళోలేరు. నేను పోలిక పట్టలేను అన్న ధైర్యంతో ఈ చీర కట్టేసుకుని మా యింటికే వచ్చావు." అంది.

"అంతలేసి మాటలు అనకండమ్మా! నేనేం దొంగనికాను కావాలంటే----"

"చాల్లే. ఇంకేమీ చెప్పఖ్ఖర్లేదు. దొంగతనానికి తోడు పౌరుషం ఒకటి. యికనువ్వు మా యింటిపని చెయ్యనక్కర్లేదు. ఈవేళ పాతచీర పట్టుకెళ్ళిన దానివి, రేపు పట్టుచీరో, బంగారునగో ఎత్తుకెళ్ళవని నమ్మకమేమిటి?" అంటూ చిందులేసింది.

కనకమ్మ ఏంచెప్తున్నదీ వినిపించుకోకుండా దాన్ని బయటకు పంపేసి దబాల్న తలుపు వేసింది. రావలసిన జీతం యిచ్చేయమని అదెంత ప్రాధేయపడుతున్నా - "ఈ చీరకింద విరుచుకుంటున్నాను పో!" అంది.

★ ★ ★

ఆడపడుచు పురిటికి వెళ్ళిన అత్తగారు తిరిగి వచ్చేసరికి అయిదు నెలలు పట్టింది. లలిత విసుక్కుంటూ, చిరాకు పడుతూ పనిమనిషి కుదరక ఆ కాలాన్ని ఎలానో ఈడ్చుకొచ్చింది.

శాంతమ్మగారు రాగానే కనకమ్మ పని మానేసినందుకు ఆశ్చర్యపోయారు. "ఇదేమిటే లలితా, ఎందుకు మానేసింది కనకమ్మ?" అన్నారు. "అది మానేయలేదత్తయ్యా, నేనే మాన్పించేశాను." అంటూ జరిగిన విషయం చెప్పింది.

అంతా విన్న శాంతమ్మగారి మనస్సు వికలమై పోయింది. "తొందరపడి ఎంతపని చేసావే! నాకు ఒక్క ఉత్తరం రాసినా సరిపోయేదిగా?"

"బాగుందత్తయ్యా! అలా అంటారేమిటి? అయితే ఆ చీర మీరే యిచ్చారా?"

"దానికివ్వడం కాదు. నేను పాతచీరల వాడికా చీర ఇచ్చేసి, ఒక స్టీలు గిన్నె తీసుకున్నాను. మర్నాటికి మర్నాడే కనకమ్మ ఆ పాత బట్టల దుకాణంలో ఆ చీర కొనుక్కొచ్చింది. అప్పుడు నువ్వు వూళ్ళోలేవు. నువ్వు వచ్చాక చెప్పడం మర్చిపోయాను. వెంటనే నా ప్రయాణం. నా పొరబాటు ఆ అమాయకురాలిని బాధ పెట్టిందన్న మాట" శాంతమ్మగారి కళ్ళు చెమర్చాయి. లలిత కూడ కన్నీళ్ళు పెట్టుకుంది.

తనెంత పొరబడింది. ఆ చీర పాతదే అయినా, నాజూగ్గా ఎంతోబాగుంది. అందుకే ముచ్చటపడి కనకమ్మ కొనుక్కుని ఉంటుంది. దాని నిజాయితీ ముందు తను ఓడిపోయింది. తనెంత తొందరపడింది. అసలు ఆరోజు తను గర్జించగానే - "అమ్మగారూ ఈ పాతచీర--' అంటూ కనకమ్మ ఏదో చెప్పబోయింది. ఆ మాట పూర్తిగా తను విని వుంటే యింత జరిగేది కాదు. ముచ్చట పడి ఓ పాతచీర కొనుక్కున్నందుకు కూడ కనకమ్మకి యిలాంటి పరిస్థితి ఎదురైంది. అందుకు కారణం తన తొందరపాటే. కనకమ్మ ఏమనుకుందో, ఆ పాతచీరని, కనకమ్మని మరీమరీ తలచుకొని ఒక్క నిట్టూర్పు విడిచింది లలిత.

●

*(ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది:5-5-'96)*